## బడి, వైద్యశాల నిర్మాణానికి నిధులు ఇవ్వాలి

❖ ఎంపీ ఈటల రాజేందర్ ను కోరిన బీజేపీ నాయకులు



**దశ,ఎల్బీనగర్:** హస్తినాపురం డివిజన్ డివిజన్ ప్రజల కోసం ప్రభుత్వ దవాఖాన, పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ ను బీజేపీ నాయకులు కోరారు. హస్తినాపురంలో పట్టణ ప్రాథమిక వైద్యకేంద్రం, జడ్పీ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కు స్థానిక నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ వైద్యశాల, ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని రంగారెడ్డి కలెక్టర్ ను ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. ప్రభుత్వం భూమిని కేటాయిస్తే, ప్రభుత్వ వైద్యశాల, ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ఎంపీ కోటాలో నిధులు మంజూరు చేస్తానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గజ్జల రాజు గౌడ్, డివిజన్ సెక్రెటరీ గౌని వెంకటేష్ గౌడ్, ఎస్టీ మోర్చా నాయకుడు మునీల్ నాయక్, డివిజన్ ఉపాధ్యక్షుడు శేఖర్ గౌడ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి లక్ష్మి కాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆదరించండి అండగా ఉండి అభివృద్ధి చేస్తా

❖ 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కప్ప మమత మహేష్.



**దశ,గజ్వేల్:** ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల సంక్షేమం, పథకాలు సాధ్యం అని గజ్వేల్ మున్సిపాలిటీ ఒకటో వార్డు అభ్యర్థి కప్ప మమత మహేష్ పేర్కొన్నారు.తనను గెలిపిస్తే అండగా ఉండి అభివృద్ధి చేస్తానని ఓటర్లను అభ్యర్తించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో గురువారం రోజున కాంగ్రెస్ అభ్యర్థి కప్ప మమత మహేష్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ తమకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ఓటర్లతో కలిసి బారీ ర్యాలీ నిర్వహించారు బతుకమ్మలు ఆడారు. ఈ సందర్భంగా అభ్యర్థి మమత మహేష్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉండే వ్యక్తిని నాకు ఓటు గెలిపించాలని కోరారు. తన గెలుపుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా శ్రమిస్తానని అభ్యర్థి పేర్కొన్నారు. ఇన్చార్జ్ కుమార్,నీరుడి స్వామి మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల హయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమార్థం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలుపరుస్తుందని తెలిపారు. ఒకటో వార్డు అభ్యర్థి కప్ప మమత మహేష్ ను గెలిపించాలని కోరారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి





❖ మాయ మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
❖ కాంగ్రెస్ సర్కార్ పనితీరుపై మండిపడ్డ ఎంపీ వద్దిరాజు

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ఈనెల 11వ తేదీన జరగనున్న కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్కు బుద్ధి చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. గులాబీ పార్టీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఎంపీ రవిచంద్ర గురువారం కొత్తగూడెంలోని 10వ డివిజన్ బూడిదగడ్డ, 58వ డివిజన్ హనుమాన్ బస్తీ, 25వ డివిజన్ ఏ పవర్ హౌస్ బస్తీలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు పలుచోట్ల ప్రజలను ఉద్దేశించి ఉత్తేజిత ప్రసంగం చేశారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో అన్ని రంగాలలో రాష్ట్రం గొప్పగా అభివృద్ధి చెందగా కాంగ్రెస్ ప్రభుత్వంలో అధోగతి పాలవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలకులు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పూర్తిగా మర్చిపోయారని ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆందోళన చెందారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన సాగుతున్నదని ఇది కేసుల పోలీసుల ప్రభుత్వం ఆయన వ్యాఖ్యానించారు.

అక్రమ కేసుల బనాయింపు విచారణలు బెదిరింపులు అదిరింపులు వేధింపులు అరెస్టులకు భయపడబోమని ప్రజలకు కొండంత అండగా కేసీఆర్ ఉన్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ అని పాలకుల పనితీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్న విషయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి గుర్తించుకుంటే మంచిదన్నారు. ప్రజలు కేసీఆర్ రెండేళ్ల పాలనను, రేవంత్ రెడ్డి రెండేళ్ల ప్రభుత్వాన్ని పోల్చి చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు భంగపాటు తప్పదని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎంపీ మాజీ చైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, అభ్యర్థులు వేల్పుల వీరమ్మ, ఏమునూరి శివకృష్ణ, వేముల ప్రసాద్ బాబు, నాయకులు కొట్టి వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, నవతన్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అభ్యర్థి విద్యాసాగర్ ను గెలిపించండి

❖ ఆయన విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 58వ డివిజన్ బీజేపీ అభ్యర్థి దేవులపల్లి విద్యాసాగర్ విజయాన్ని కాంక్షిస్తూ ఆ డివిజన్లో గురువారం ఎన్నికల ఇంచార్జి ధర్మారావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జీవీకే మనోహర్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కొత్తగూడెంకు రూపాయి రాలేదనే విమర్శించారు. కార్పొరేషన్ లో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే కొత్తగూడెం అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణంలో జరిగిన ప్రతి పని కేంద్రం నిధులతోనే జరిగిందని తెలిపారు. ప్రజల కోసం నిత్యం పని చేసే నిజాయితీ నిబద్ధత కలిగిన బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కొత్తగూడెం మరింత అభివృద్ధి చెందాలన్నా, మరిన్ని నిధులు రావాలన్నా బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మీద బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గాంధీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## కుష్టు వ్యాధి నిర్మూలన కు సహకరించండి

❖ కోదాడ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఒంటెపాక అమర్ కుమార్.



**దశ నడిగూడెం :** స్పర్శ్ లెప్రసీ వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలో ని కస్తూర్బా బాలికల వసతి గృహంలో లెప్రసి వ్యాధి పై ప్రతిజ్ఞ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించిన అనంతరం కోదాడ డివిజన్ డిప్యూటీ పారామెడికల్ అధికారి ఒంటెపాక అమర్ కుమార్ పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ వివక్షను అంతం చేయడం గౌరవాన్ని కాపాడటం అనే నినాదంతో ప్రతిజ్ఞ ను అన్ని వసతి గృహాలలో, పాఠశాల లో జనవరి 30 2026 నుండి ఫిబ్రవరి 13 2026 వరకు వైద్య ఆరోగ్య శాఖ చే నిర్వహిస్తారని కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చెవులపై ,వీపుపై ,ఎదపై నొప్పిలేని బొడిపెలు, అరచేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే స్థానిక ఆశా కార్యకర్తల కు, ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని వారిని గుర్తించి నిర్ధారణ అనంతరం వారికి ఎం. డి. టి. చికిత్స విధానం ద్వారా వ్యాధిని నయంచేయవచ్చని తెలిపారు. సబ్ యూనిట్ అధికారి సముద్రాల సూరి హెల్త్ అసిస్టెంట్ తొనుకునూరి కృష్ణ మూర్తి, ఎ.ఎన్.ఎం సుజాత,కె. జి. బి. వి ఉపాధ్యాయినులు విజయ, సునీత మౌనిక, అనిత తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థను పట్టించుకోరా?




❖ ఫుట్ బాల్ ఆటకు, మిస్ వరల్డ్ పోటీలకు తప్ప
❖ పబ్లిక్ పాలసీ పెట్టడానికి సీఎంకి టైం లేదా ?
❖ ఓట్ల కోసం అజారుద్దీన్‌ని మంత్రిని చేశారు
❖ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణవాదులు

**దశ, హైదరాబాద్:** విద్యకు సంబంధించి 20 శాతం బడ్జెట్‌ను కేటాయించాలని కోరుతూ గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, ప్రొఫెసర్ కోదండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో మార్పు కోసం విదివిధానాలు, పబ్లిక్ పాలసీ తెచ్చేందుకు ముఖ్యమంత్రికి సమయం ఉందా అని ప్రశ్నించారు. మెస్సీతో ఫుట్ బాల్ ఆడటానికి, మిస్ వరల్డ్ పోటీలకు సీఎం వందల కోట్లు ఖర్చు పెడతాడని, పబ్లిక్ పాలసీ పెట్టడానికి మాత్రం చిల్లు గవ్వ లేదంటాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలసీ ఏ లేకపోతే బడ్జెట్ గురించి ఏం మాట్లాడతారన్నారు. ఎమ్మెల్సీ లేకుండా జూబ్లీహిల్స్ ఓట్ల కోసం అజారుద్దీన్‌ని మంత్రిని చేస్తారు కానీ విద్యా వ్యవస్థను బాగు చేయడానికి విద్యావేత్త కావాలి కదా అన్నారు. అడ్డమైన వాటికి సంపద ఉన్నప్పుడు విద్యకు ఎందుకు సంపద ఉండదని నిలదీశారు. యంగ్ ఇండియా స్కూల్స్ పెడతామని అంటున్నారు కానీ విద్యారంగానికి ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఇలా దుర్మార్గమైన రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అలాగే, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. అందరికీ సమానంగా నాణ్యమైన విద్య అందేది ఒక్క ప్రభుత్వ పాఠశాలలో మాత్రమేనని, అందుకే పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాడుపడాలని అన్నారు. సరళీకరణతో విద్యను మొత్తం ప్రైవేటుకి అప్పజెప్పి, నిధులు లేవని చదువు చెప్పమని చేతులు దులుపుకునే పరిస్థితి వచ్చిందని ప్రొఫెసర్ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు.

# పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

❖ తొలి విడతలో రూ.259.36 కోట్లు విడుదల
❖ నిధుల విడుదలపై మంత్రి సీతక్క హర్షం




**దశ, హైదరాబాద్:** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం గత కొంతకాలంగా నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. ఇందులో భాగంగా తొలి విడతగా రూ.259.36 కోట్లను విడుదల చేస్తూ గురువారం కేంద్ర ఆర్థిక శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, రాష్ట్రంలో గ్రామ పంచాయతీల గడువు ముగిసినప్పటికీ ఎన్నికల నిర్వహణలో జాప్యం జరగడంతో కేంద్రం నిధులను పూర్తిగా నిలిపివేసింది. కాగా, కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తరువాతే పెండింగ్ నిధులు విడుదల చేస్తామని స్పష్టంగా ప్రకటించింది. ఎన్నికలు లేని పరిస్థితిలో నిధుల విడుదల సాధ్యం కాదన్న కేంద్ర వైఖరి కారణంగా గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.రాష్ట్రంలోని పంచాయితీలకు కేంద్రం రూ.3 వేల కోట్ల దాకా బకాయిలు ఉండగా.. అందులో తొలి విడతగా రూ.259.36 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ రావడంతో పంచాయతీల్లో ఆశలు చిగురించాయి. మిగిలిన నిధులను కూడా దశలవారీగా విడుదల చేయాల్సి ఉంది.

**మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 5వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి "జెర్కొని మమత రాజు" కి మద్దతుగా నిర్వహించిన ప్రచార సమావేశంలో పాల్గొని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటి) ప్రసంగించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.**

-(దశ, ఇబ్రహీంపట్నం )

